


# పశ్చాత్తాపం

కోరుకొండ సత్యానంద్

**నేను** గదిలో మంచం మీద కూర్చున్నాను. కిటికీలోంచి బయటకు చూస్తుంటే వరండా వాలుకుర్చీలో కూర్చున్న నాన్నగారు స్పష్టంగా కనిపిస్తున్నారు.

నాన్నగారు ఎటో చూస్తున్నారు.

నాన్నగారి కళ్ళలో కన్నీరు లేకపోలేదు. ఆ చూపుల్లో ఏ భావమూ లేకపోలేదు. గుండె చాలని బాధను బిగపెట్టుకుని ఆపుకున్నా అది ఆగకుండా ఒక్కొక్క కన్నీటి చుక్కగా మారి ఆ కళ్ళలో సన్నని కన్నీటి పొరలా ఏర్పడింది. ఎన్నో బాధల భావాల కలయికగా ఉంది ఆ చూపులోని భావం.

అదేమిటో నే నూహించగలను. నే నూహిస్తున్నది నిజం.

నా చిన్నప్పుడు నన్నెలా పెంచారు నాన్నగారు? తన ప్రాణంగా, ప్రాణానికి ప్రాణంగా, ప్రేమ పాశంతో తనని పెనవేసుకుని ముద్దు లాడేవారు. తనకు లేని చదువు నాకు పూర్తిగా ఉండాలని, పది మందిలో ఎంతో పేరు గడించాలని ఎంతగా ఆలోచించారు నా కోసం?

ఆయన ఆశ నిరాశ కాలేదు. నాన్నగారు నా మీద పెట్టుకున్న నమ్మకం వమ్ము కాలేదు.

ముద్దుగా పెరిగినా మంచిని మరిచిపోలేదు నేను. చదువుకున్నాను. మంచి ఉద్యోగం సంపాదించాను. తప్పటడుగులు వేసినప్పుడు నాన్నగారు చేయి పట్టి నడిపించారు. తప్పటడుగులు వేయకుండా బాగా పైకి వచ్చాను. చదువులో,ఉద్యోగంలో మా బంధువు లందరి కంటె పైనే ఉన్నాను.

కానీ. నాన్నగారు? మూగ ఆవేదనతో కాలాన్ని బరువుగా ఆ కుర్చీలోనే గడిపేస్తున్నారు.

నా చిన్నప్పుడు నాన్నగారి కాలు ఒక చోట ఉండేది కాదు. ఎప్పుడూ తిరుగుతూనే ఉండేవారు. కానీ ఇప్పుడు? ఇంటి దగ్గరే ఏదో నిరాశతో, నిస్పృహతో ఉంటున్నారు.

అది స్వార్థం అని అనిపిస్తుంది ఇప్పుడు నాకు. ఏమో, స్వార్థమో, మరేమో. ఏదో అదృశ్య హస్తం నా నోరు నొక్కేసేది.

ఒక కార్మికుడిగా కండల్ని కరిగించి ఆ డబ్బుని నా కోసం, నా జీవితం కోసం వెచ్చించి నాకో బంగారు బాట వేశారు. అది కనీస ధర్మం అని అనుకోవచ్చు. కానీ, శక్తి లేకపోయినా ఎవరు ఆ ధర్మం నిర్వర్తిస్తారు? అలా చేసిన నా తండ్రిలాటి వారు అరుదేమో!

అలాంటి తండ్రి ఋణం నే నెలా తీర్చుకోగలను?

కానీ,తీర్చుకోడానికి ప్రయత్నిస్తున్నానా? లేదనే చెప్పొచ్చు. నా జీతం అనీ, నా కష్టార్జితం అనీ నే నేం చేస్తున్నాను? నా డబ్బులో తప్పదన్నట్లుగా మా ఖర్చుల కని వందో, వందో నాన్నగారి చేతికి ఇస్తున్నాను. మిగతా డబ్బంతా నా జేబులోనే ఉంచుకుంటున్నాను. వందంటే ఎంత నాన్నగారికి? డబ్బంటే నీళ్ళే నాన్నగారికి. వయసులో ఏవో పెద్ద పనులు చేసినా ఆయన ఎంత మందిని చూశారు? తనకు కాని వారినికూడా చూశారు. ఆదరించారు.

ఆ వందకు ఎన్నో రెట్లు సంపాదిస్తున్న కొడుకు నని నాన్నగారు గర్విస్తున్నారా? నా కష్టం అంతా చిన్న కొండుకు ఇంత గడిస్తూ ఒకే వంద రూపా యలు... డబ్బు ముఖం ఎరగని వాడి కిచ్చినట్లు ఇస్తున్నాడు అని బాధ పడుతున్నారా?

అసలు నిజం ఆలోచిస్తే నే నేమవుతాను నాన్న గారికి?

మా ఇద్దరి మధ్యా ఎటువంటి రక్తసంబంధం లేదు. కానీ ప్రేమ పాశం పెనవేసుకుని ఉంది. విడదీయలేని ప్రేమబంధం మమ్మల్ని బలంగా బంధించి ఉంది. 'ఆ' విషయం నా కెప్పుడూ గుర్తు రాదు. మొదటి సారి అది తెలిసినా నేనూ ఏమీ బాధ పడలేదు. కారణం? ఏమో! ఎందుకో!

జన్మరహస్యం తెలిసినప్పుడు మనిషి కదిలి పోతాడు. ఎవరి మీదో ఆవేశంతో ఊగిపోతాడు. కానీ, నే నెప్పుడూ అలా అవలేదు. నిజం తెలిసిన మొదటి క్షణంలో ఒక్కసారి నా తల తిరిగిన ట్టయింది. అప్పుడు అమ్మ, నాన్నల వైపు చూశాను. వాళ్ళు సిగ్గుగా, భయంగా, బాధగా ఉన్నారు.

నేను నవ్వాను. నిజం నేను సరిగా విననట్లుగా నటించాను.

నన్ను కన్న తల్లి దండ్రులు ఎవరో తెలిసిన మొదటి క్షణంలో నా రక్తంలో ఒక కొత్త కదలిక కదిలింది. కానీ తమాయించుకున్నాను. తరవాత అది నాకు చాలా మామూలు విషయంగా మారి పోయింది. ఆ తరవాత ఎప్పుడూ వాళ్ళ దగ్గరకు వెళ్ళేందుకు ప్రయత్నించ లేదు. వాళ్ళూ రాలేదు. నా అవసరం వాళ్ళకు లేనట్లే వాళ్ళ అభిమానాన్ని నేను కోరుకోలేదు. వాళ్ళ ఆస్తికి ఆశ పడనూ లేదు.

దానికి కారణం ఏమిటి? నా తండ్రి...ప్రేమలు నిండిన తండ్రి; తన రక్తం నాకు పెట్టి పెంచిన తండ్రి. నా తండ్రి లాంటి తండ్రి మరెవ్వరికీ దొరకడు.

అది నా అదృష్టం. అది నే నెప్పుడో చేసుకున్న పుణ్యం!

కానీ నే నెందుకు ఇలా ప్రవర్తిస్తున్నాను? ఎందుకు ఇంత స్వార్థంతో నిండిపోయాను? ఇది నాన్నగారు ఎప్పుడో చేసుకున్న పాపం?

నా ఆలోచనలు నన్ను పిచ్చెక్కిస్తున్నాయి. కథలు వ్రాయడం అలవాటున్న నేను ఒక చిన్న విషయాన్ని మరీ ఎక్కువగా ఆలోచించడం లేదు కదా!

ఇది చిన్న విషయమా? ఇది ప్రేమకు సమా ధానం—కరుణకు కమ్మని జవాబు. అభిమానానికి అందమైన ఆలంబన. మమతలకు బలమైన వంతెన.

కానీ, నేను చేస్తున్న దేమిటి? నాన్నగారి ప్రేమకు, కరుణకు, అభిమానానికి, మమతకు నే నేంజవా బిస్తున్నాను? ఆయన కష్టం తిని, పెరిగి ఆయన ఈ ముసలి జీవితాన్ని కష్టాల పుట్టగా తయారు చేస్తున్నాను.

డబ్బంటే ఆశలేని మనిషి కాబట్టి సరిపోయింది. కష్టానికి ప్రతిఫలం కోరని నీడు మనిషి కాబట్టి కుదురుతుంది. అసలు నే నేం చేయాలి? ఎలా ప్రవర్తించాలి? ఏం చేసినా ఇప్పుడు చేసినట్లు చేయకూడదు. నా ప్రవర్తన మారిపోవాలి.

జేబు నిండా డబ్బంటే నాన్నగారు అలా ఉండే వారా? అలా ఉండేట్లు చేసింది నేనే కదూ! ?

నాన్నగారి వైపు మళ్ళీ చూశాను. కళ్ళు చూసే దిక్కులు మారినా, ఆ భావం మాత్రం మారలేదు. ఆ నిర్లిప్తత పోలేదు.

నాన్నగారి కోపం అమ్మ మీద చూపించినప్పుడు నేను చూసి ఎంతో భయపడేవాడ్ని. జడిసిపోయి ఏడ్చేసేవాడ్ని. అంత కోపం లోనూ ఏడుస్తున్న నన్ను చూసి కోపాన్ని చల్లార్చుకుని నన్నెత్తుకుని బయటికి తీసుకుపోయే వారు.

నా మీద అంత ప్రేమ చూపించాల్సిన అవసరం ఏముంది? పిల్లలు లేకపోతే మనుష్యులిక బతకలేరా? ఎంత ప్రేమగా చూసినా పై వాళ్ళు పైవాళ్ళే అంటారు.

చిన్నప్పటి నుండీ అలా, అంత ప్రేమగా చూసిన తండ్రిని అలా చూస్తూ, మధ్యలో వచ్చిన నా భార్యను విపరీతమైన ప్రేమతో చూసుకుంటు న్నాను. కోరిన ముచ్చట్లను తీరుస్తున్నాను.

అవును. భార్యను చూడాల్సిన బాధ్యత భర్తది కాదా? అయితే తండ్రిని చూడాల్సిన బాధ్యత తనయుడిది కాదా? అన్నీ తెలుసు నాకు. తెలిసే తప్పు చేస్తున్నానా?


కానీ, అప్పుడప్పుడూ నాన్నగారు అంటుంటారు భార్యకు విలువ నివ్వాలని, ప్రతిదీ ఆమెతో చర్చించి ఆమె సలహా సహాయాలతో ఏ పనైనా ప్రారంభించ మని.

అప్పు డెందుకో నాన్నగారి గొంతు ఆర్ద్ర మవుతుంది. వివరించి చెప్పలేని వింత భావం స్ఫురిస్తుంది.

నేను పెద్దయ్యాక ఎన్నో తెలుసుకున్నాను నాన్నగారి గురించి. నాన్నగారికి పరస్త్రీ వ్యామోహం ఎక్కువట. ఆ మాటను నొక్కి నొక్కి గుస గుస లాడుకునే వాళ్ళు అమ్మతరఫు వాళ్ళు. వాళ్ళందరూ నాన్నగారి నీడలో ఎన్నో ఏళ్ళు బతికిన వారే.

వాళ్ళనుకునేవన్నీ నిజాలే. ఆ విషయం నాకూ తెలుసు. కానీ నేను మెదపలేక పోయేవాడ్ని. నాన్నగారి విషయాలు విన్నాక అప్పుడప్పుడూ నాకు కోపం బాగా వచ్చేది. కానీ తీరా నాన్నగార్ని చూశాక ఆ కోపం చల్లారిపోయేది. ప్రేమ పొంగి పొరలేది.

అది నాన్నగారిలో ఉన్న అద్భుత శక్తి. ఆ శక్తి నన్ను చల్లబరిచేసేది. నా నోరు మెదిలేది కాదు.



ఆలోచనల వరద నా మెదడులో అల్లకల్లోలాన్ని సృష్టి స్తుంది. అలా చాలా సేపు గడిచింది.

అంతలో ఎక్కడినుండో వచ్చాడు మా అబ్బాయి సురేష్. వాడిది పదేళ్ళ వయసు. వాడు మంచివాడే అయినా అప్పుడప్పుడే ఎందుకో విపరీతంగా, విద్యార్థంగా ప్రవర్తిస్తుంటాడు. అన్న మాటను పట్టుకుని ప్రేళ్ళాడతాడు. అందుకే వాడి మీద చికాకు, కోపం ఎక్కువై పోతుంటాయి అప్పు డప్పుడూ.

వాడు పరుగెత్తుకుంటూ వచ్చి నా గదిలోకి వెళ్ళాడు. మరు నిమిషంలో చేతిలో ట్రాన్సిస్టరుతో బయటకు ఉరుకుతున్నాడు.

"ఒరే—అదేంట్రా?" అని అడిగే అవకాశం కూడా ఇవ్వలేదు వాడు నాకు.

వాడు ఆ ట్రాన్సిస్టరును పట్టుకుని బయట పడకకుర్చీలో కూర్చుని ఉన్న నాన్నగారి దగ్గరకు వెళ్ళి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని ఆయాసంతో ఆత్రంగా గబగబా ఏదో అంటున్నాడు.

అదంతా నాకు కిటికీలోంచి కనిపిస్తుంది... వినిపిస్తుంది.

"తాతయ్యా! నాతో పందెం కాస్తారా?" అని నాన్నగారి ముఖంలో ముఖం పెట్టి అడిగాడు సురేష్.

ఏదో ఆలోచిస్తూ కూర్చున్న నాన్నగారు తల నెమ్మదిగా ఎత్తి "దేనికిరా?" అని అడిగారు.

"మనకి ఎలక్షన్లు అవుతున్నాయి కదా! ఇంకో అయిదు నిమిషాల్లో ఎవరు గెలిచారో చెబుతారట. నేనో పార్టీ పేరు చెప్తాను. మీరో పార్టీ పేరు చెప్పండి. మీరు చెప్పిన పార్టీ గెలిస్తే నేను మీకు యాభై రూపాయలు, నేను చెప్పిన పార్టీ గెలిస్తే మీరు నాకు యాభై రూపాయలు ఇవ్వాలి సరేనా?" అన్నాడు వాడు.

నాన్నగారు చిన్నగా నవ్వారు వాడు మాట్లాడే మాటల తీరుకి.

"ఆఁ. సరేరా!"

సురేష్ ఒక పార్టీ పేరు చెప్పాడు. నాన్నగారుకూడా ఒక పార్టీ పేరు చెప్పారు.


సురేష్ రేడియో ఆన్ చేశాడు. అనౌన్సరు ఓట్ల మొత్తాన్ని, ఏయే పార్టీకి ఎన్నెన్ని ఓట్లు వచ్చాయో చెబుతున్నాడు. సురేష్ కొత్తగా, ఆత్రంగా వింటున్నాడు. నాన్నగారు మాత్రం మామూలుగానే కుర్చీలో వాలి కూర్చున్నారు.

రెండు నిమిషాల తరవాత సురేష్ గట్టిగా నవ్వుతూ "తాతయ్యో! అలకించారా. అహహ. నేను చెప్పిన పార్టీయే గెలిచింది. నేను చెప్పిన పార్టీ పేరునే గెలిచిన పార్టీ అని రేడియోలో చెప్పారు."

నాన్నగారు చిన్నగా నవ్వి "వెరీగుడ్" అన్నారు నెమ్మదిగా.

"ఆ. వెరీగుడ్ అంటే సరిపోదు. పందెం డబ్బులు ఇలా ఇవ్వండి. సినిమాలో విలన్‌లా పోజు పెట్టి అడిగాడు వాడు. నాన్నగారు చేతుల్ని తల కింద పెట్టుకుంటూ, చిన్నగా నవ్వుతూ "ఇస్తాన్లేరా మీ నాన్న జీతాలకి. ఇది నెలాఖరు కదా!"

"ఆఁ. ఆఁ. అదేం కుదరదు. ఇప్పుడే ఇవ్వాలి నా




యాభై రూపాయలు."

ఒక్కసారి వాడ్ని పిలిచాను. వాడు వినిపించుకో లేదు.

"ఇవ్వపోతే కుదర్దు. ఇయ్యి తాతయ్యా!" వాడు మారాం చేస్తున్నాడు.

"సురేష్ ఇలారా!" అని వాడ్ని దగ్గరకు తీసుకుని "నెలాఖర్లో డబ్బు ఎలా వస్తాయిరా? మీ నాన్న జీతంవస్తేనే కదా నా దగ్గర డబ్బు లుంటాయి పొద్దున్నే బజారుకి లేవంటే పనిమనిషికీ పది రూపాయ లిచ్చాను. ఎంతరా నాలుగు రోజుల్లోనే కదా జీతాలు అప్పు డిస్తాన్లే. సరేనా?" బుజ్జ గించారు.

"లేదు తాతయ్యా! పందెం అంటే పందెమే! అలాంటప్పుడు ఎందుకు పందెం కాశారు?"

"నేను గెలుస్తా ననుకున్నా్రా. కానీ ఓడి పోయాను. నేను గెలుచుకుంటే నువ్వెక్కడ్నుంచి తెస్తావురా ఆ యాభై రూపాయిలూ?"

"ఏముంది? డాడీ నడిగి ఇచ్చేస్తాను."

"అవునా? నేను కూడా మీ డాడీ నడిగే ఇవ్వాలి. మీడాడీకి జీతా లందాక అడిగి ఇస్తాను. సరేనా?"

"అదేమిటే, తాతయ్యా? నేను చిన్నోడ్ని కదా, అందుకే డాడీని అడిగిస్తాను. మరి మీరు పెద్దవారే కదా! మీరు డాడీని అడగడం ఏమిటే?"

నాకు కోపం వచ్చి గట్టిగా పిలిచాను వాడ్ని. వాడు అసలు నా వైపు చూడలేదు. దగ్గరకు వెళ్ళి వాడ్ని కొట్టి తీసుకొస్తే నాన్నగారు బాధ పడతారు. వాడంటే నాన్నగారికి ఎంతో ముద్దు.

"అదా బాబూ, నీ అనుమానం? నీకు డాడీ కాబట్టి మీ డాడీని నువ్వు అడుగుతున్నావ్. మరి మీ డాడీ నాకు కొడుకు కదురా. అందుకు నేను వాడ్ని అడుగుతున్నాను. నువ్వుపెద్దయ్యాక మీ నాన్న ముసలివాడై పోతాడా? అప్పుడు నిన్ను మీ డాడీ డబ్బు లడుగుతాడు. అదీ సంగతి."

"అహా... మరైతే, తాతయ్యా! అప్పుడు మీరు ఎవర్నడుగుతారు డబ్బులు?"

ఆ మాటకు నాన్నగారు నవ్వారు కాస్త గట్టిగా. "అప్పుడు నే నెక్కడుంటా్రా?" అన్నారు.

"ఏం తాతయ్యా?"

"దేవుడి దగ్గరకు వెళ్ళిపోతాను కదరా!"

"దేవుడి దగ్గరకా? అంటే నానమ్మ వెళ్ళి పోయిందంట. అక్కడికేనా తాతయ్యా? దేవుడి దగ్గరి కెళ్ళడం అంటే చచ్చిపోవడమే కదూ?"

"అవున్రా!" అని తల పట్టుకుని పైకి చూస్తూ కళ్ళు మూసుకున్నారు నాన్నగారు.

"ఒరే! సురేష్! ఇలారా" గట్టిగా పిలిచాను ఈ సారి.

వాడు రేడియో కట్టేసి "ఉండు డాడీ! తాతయ్య దగ్గర డబ్బులు వసూలు చేసి వస్తాను" అన్నాడు.

దగ్గరకు వెళ్ళి వీపు మీద నాలుగు వడ్డిద్దా మన్నంత కోపం వచ్చింది నాకు. కానీ, నాన్నగారు ఆయన కారణంగా వాడ్ని కొట్టానని బాధపడతారు.

అవును. నాన్నగారికి అందరూ ప్రాణమే! కానీ, ఆయ నంటేనే ఎవ్వరికీ ప్రాణం కాదు. సురేష్ కూడా నాన్నగార్ని బాధపెడుతున్నాడు. అవును మరి నా కన్నకొడుకు కదా!

మళ్ళీ సురేష్ మొదటికే వచ్చాడు.

"చెప్పు తాతయ్యా! నా డబ్బులు సంగతి ఏమిటి? ఆ విషయం తేల్చండి ముందు"

"ఏమిట్రా సురేష్ నీ అల్లరి? అంత అర్జంటా? అయితే నే నో పని చెప్తాను. చేస్తావా?"

"ఏమిటో చెప్పండి."

"నా దగ్గర ప్రస్తుతానికి అయిదు రూపాయ లున్నాయి. అవి ఇప్పుడే ఇచ్చేస్తాను. మిగిలిన నలభై అయిదు రూపాయలూ తర్వాత, అంటే మీ నాన్న జీతాలకి ఇస్తాను. సరేనా?"

"ఆఁ సరేగానీ, తాతయ్యా! ఇప్పుడు ఈ అయిదు రూపాయలూ నా కివ్వాలి. జీతాలకి యాభై రూపా యలూ ఇవ్వాలి."

"ఇదేం అన్యాయంరా బాబూ?"

"అన్యాయం కాదు తాతయ్యా! ఈ అయిదు రూపాయలూ వడ్డీ. అది అసలు. అలా అయితేనే ఒప్పుకుంటాను. లేకపోతే మొత్తం అంతా ఇప్పుడే ఇచ్చేయండి" అన్నాడు సురేష్.

"సర్లేరా" అని నవ్వుతూ లేచి ఇటువైపు గదిలోకి వచ్చారు నాన్నగారు. ఈ గదిలో ఉన్న తన చొక్కా కోసం.

"ఎందుకునాన్నగారూ? వాడికా డబ్బులు ఇవ్వడం పిపు మీద నాలు గెయ్యాల్సింది. వూరుకునేకొద్దీ అల్లరి ఎక్కువై పోతూంది వాడికి" అన్నాను నేను.

తన జేబులోంచి అయిదు రూపాయల నోటును తీస్తూ నా వైపు అదోలా చూశారు నాన్నగారు.

"ఒరే ఆనంద్! ఇప్పుడు మరిచిపోయావుగానీ నువ్వు చిన్నప్పుడు ఇంతకంటే ఎక్కువే అల్లరి చేసే వాడివి" అని నాన్నగారు బయటకు వెళ్ళిపోయారు.

నాన్నగారు అన్నమాట నాకు అదోలా అన్పించింది. అవును. మరిచిపోయాను. చిన్నప్పుడు నేను చేసిన అల్లరినీ మరిచిపోయాను. మీరు నాకు పంచిచ్చి ప్రేమాభిమానాల్నీ మరిచిపోయాను. లేదు లేదు నాన్నగారూ. నేను వాటిని మరిచిపోలేదు. కానీ, మరిచిపోయిన వాడిలా ప్రవర్తిస్తున్నాను."

అంతలో నాకు బయట నాన్నగారు అంటున్న మాటలు విన్పించాయి.

"ఏరా బాబూ! ఈ అయిదు రూపాయలూ ఎవరికిస్తావు?"

"ఎవరికా? చెప్పమంటావా తాతయ్యా?"

"వూఁ ... చెప్పు."

"మీకుమాత్రం కాదు" అని గట్టిగా నవ్వి "మా డాడీకి ఇస్తాను" అన్నాడు వాడు.

"వెరీగుడ్. మీ డాడీకే ఇవ్వాలి. మీ డాడీకి నువ్వు కన్న కొడుకువి కాబట్టి ఈ అయిదు రూపాయలూ మీ డాడీకే ఇవ్వాలి. మరి తాతయ్య కేమివ్వాలో చెప్పు?

సురేష్ నవ్వుతూ "ముద్దులు" అని నాన్నగారి బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాడు.


నాన్నగారు అన్నమాటలు నా మనసుకు తగిలాయి. ఆ ఒక్క వాక్యంలో ఎంత అర్థాన్ని ఇమిడ్చిఅన్నారు? అలా అనడం నాకు తెలియ పరచడానికి కాదూ! నేను కళ్ళు తెరుచుకోవడానికి కాదూ!

"డాడీ! ఇదిగో, తాతయ్య దగ్గర వసూలుచేసేను జీతాలకి ఇంకా ఇస్తానన్నారు తాతయ్య" అని అయిదు రూపాయల నోటుని నా చేతి కందించి బయటుకు తుర్రుమన్నాడు సురేష్

ఈ సంఘటన చిన్నదే అయినా నా గుండె మాత్రం నేను మోయలేనేమో అన్నంతగా బరువెక్కి పోయింది. ఆ అయిదు రూపాయల నోటుని నాన్నగారి చొక్కా జేబులో పెట్టేశాను.

● ● ● ●

ఆ సంఘటన జరిగిన రోజునుండీ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. ఆ ఆలోచనలు నన్ను గజిబిజి చేసేసినా చివరకు అవి ఓ కొలిక్కి వచ్చి నాకో నిర్ణయాన్ని అందించాయి. ఏం జరిగినా, ఏమైనా అనుకున్నది చేసేయాలి. అప్పుడుగానీ నాలో చెలరేగి




వూపిరాడనివ్వని ఆందోళన తగ్గదు. ఆలోచనలతో వేడెక్కి పగిలిపోతుందేమోనన్న మెదడు చల్లారి ప్రశాంతంగా ఉండదు. ఇన్నాళ్ళూ నేను మనిషిని కాలేకపోయినా, ఈ రోజు నుండైనా మనిషిగా మారాలనుకుంటున్నాను. నాన్నగారి గుండెలోని బాధను తగ్గించాలని, కళ్ళలోని నిరాశా,నిస్పృహల కన్నీటి పొరను తుడిచివేయాలని ఆత్రతగా ఉంది నాకు.

ఈ రోజు ఆ ఆత్రత వెల్లువై ఉరకలు వేస్తూంది కారణమ్ — ఈ రోజే నాకు జీతా లందాయి.

రాధ వంటింట్లో ఉంది. సురేష్ నా గదిలోనే ఏదో రాసుకుంటున్నాడు. నా గుండెలోని బాధ నాలో చెలరేగుతున్న ఆందోళన అన్నీ రాధకు చెప్పేశాను. ఆమె సలహాని తీసుకున్నాను. నా ఆందోళనను అర్థం చేసుకుని, నేను తీసుకున్న నిర్ణయాన్ని సంతోషంగా ఒప్పుకుంది రాధ.

గడియారం ఏడు గంటలు కొట్టింది. సురేష్ ఇంకా రాసుకుంటున్నాడు.

"బాబూ!" అని వాడ్ని పిలిచాను.

వాడు తలెత్తి నా వైపు చూసి "ఏం డాడీ!?" అన్నాడు.

"బయటి కెళ్ళి తాతయ్యగార్ని నేను రమ్మన్నానని పిలిచి, నువ్వు బయటి కెళ్ళి ఆడుకొని భోజనాల సమయానికి రా" అన్నాను.

వా డే మూడ్‌లో ఉన్నాడో గానీ కోతి ప్రశ్న లెయ్యకుండా బయట కెళ్ళాడు "అలాగే, డాడీ!" అంటూ.

నేను గది మూల నున్న ఈజీచెయిర్‌ని మధ్యలో ఫ్యాను క్రింద వేసి దాని ప్రక్కను ఓ కుర్చీని వేసి అంతా రెడీ చేశాను.

అంతలో — నాన్నగారు గదిలోకి వస్తూ— "దేనికి, బాబూ, నన్ను పిలిచావంట?" అని అడిగారు.

నేను నాన్నగారి వైపు చూశాను. ఆయన ముఖంలో ఏ కొత్త భావమూ కన్పించలేదు.

"ఇలా కూర్చోండి, నాన్నగారూ" అన్నాను నెమ్మదిగా.

నాన్నగారు ఏమీ మాట్లాడకుండా వచ్చి వాలు కుర్చీలో కూర్చున్నారు.

ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత "ఎందుకు బాబూ ఇవాళ అదోలా ఉన్నావ్? నన్ను రమ్మనడం ఎందుకు? ఏమి టిదంతా?" నాన్నగారు నాలో కన్పిస్తున్నదేదో గమనిస్తున్నట్టుగా అన్నారు.

"ఏం లేదు. నాన్నగారూ ... మీతో ఒక విషయం మాట్లాడాలి."

అలా అంటున్నప్పుడు నా గొంతు నాకే కొత్తగా విన్పించింది. తరవాత వెంటనే బీరువా దగ్గరకు వెళ్ళి బీరువా లోంచి ఓ కవరు తీసి మళ్ళా నాన్న గారి దగ్గరి కొచ్చాను.

నాన్నగారు నా వైపే చూస్తున్నారు పరిశీలనగా.

నాన్నగారి పక్క నున్న కుర్చీలో కూర్చుని ఆ కవర్ని నాన్నగారికి అందించాను.

నాన్నగారికి ఏమీ అర్థం కాక "ఇదేమిటి?" అన్నారు దాన్నందుకొని.

"తీసి చూడండి" అన్నాను నెమ్మదిగా.

నాన్నగారు ఆ కవర్ని విప్పి అందులో డబ్బుని చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపడి "ఇదేమిటి? ఈ డబ్బేమిటి?" అన్నారు.

నా గొంతులోంచి మాట రావటం లేదు. గుండె నిండా కన్నీరు నిండిపోయినట్లు బరువెక్కిపోయింది.

"అదేంటి బాబూ ... ఏడుస్తున్నా వేమిటి? ఆ కన్నీరేమిటి?" అని ఆదుర్దాగా అడిగారు నాన్నగారు.

కంగారుపడి కళ్ళ దగ్గర చేతులు పెట్టుకున్నాను. అప్పటికి గానీ తెలియలేదు నా కళ్ళ వెంట నీరొస్తూందని. గబగబా తుడిచేసుకున్నాను.

"బాబూ... ఆనంద్ ... ఏమిట్రా? ఇవా ళింత వింతగా ప్రవర్తిస్తున్నా వేమిటి?" అని అడిగారు.

ఆ అడిగే తీరులో అభిమానం ఉంది. అనురాగం ఉంది. కొంత ఆత్రత, ఆదుర్దాలు ఉన్నాయి. అన్నింటినీ మించిన ఆశ్చర్యం ఉంది.

"నా...న్న.... గారూ!" బొంగురు పోయిన గొంతుతో చిన్న పిల్లాడిలా ఏడ్చేశాను.

"బాబూ ఆనంద్ ... ఏమిట్రా ఇది... ఎందు కేడుస్తున్నావ్?" తల వంచుకొని ఉన్న నా ముఖాన్ని పట్టుకొని నాన్నగారు లేవనెత్తారు.

అంతలో రాధ వచ్చినట్లుంది. "ఏమిటమ్మా ఇది? వీడిలా ఎందు కేడుస్తున్నాడు? ఈ కవరు, ఇందులో ఈ డబ్బు ఏమిటి?" అని అడిగారు.

నేను నా రాధ వైపు చూశాను. ఆమె మవునంగా నాన్నగారి దగ్గరకు వచ్చి "అది మీ అబ్బాయి జీతం మామయ్యగారూ" అంది.

"వాడి జీతమా? అయితే నా కివ్వడ మెందుకు?"

అలా అంటుంటే నే నాగలేక పోయాను. "నాన్నగారూ! నన్ను క్షమించండి. నేను చేసిన తప్పుకు నన్ను క్షమించండి, నాన్నగారూ."

"ఏమిట్రా, ఆనంద్? ఏమిటిది? నువ్వైనా చెప్పమ్మా ఏం జరిగిందో?" అని రాధను అడిగారు. నాన్నగారి ఆ మాటల్లో ఆందోళన కన్పించింది.

"నేను చెప్తాను, నాన్నగారూ. నన్ను క్షమిస్తానంటే నేను చెప్తాను."

"మనలో మనకి క్షమాపణ లేమిట్రా? చెప్పు... ఏం జరిగిందో చెప్పు!"

"నాన్నగారూ! మీ రక్తాన్ని ధారపోసి నన్ను పెంచారు. మీ అభిమానంతో పెద్దచేసి నాకంటూ ఓ అందమైన జీవితాన్ని ప్రసాదించారు. కానీ ...' నా గొంతు పెగలలేదు.

"వూఁ కానీ ...?"

"కానీ ... నేను మీకు చేస్తున్న దేమిటి?"

"ఏమిట్రా! నువ్వు మాట్లాడుతున్న దేమిటి? నువ్వు నాకేం చేస్తున్నావ్?"

"అదే నాన్నగారూ! నేను మీకు ఏమీ చేయడం లేదు. అందుకేగా మీ రలా కుర్చీలో ఏదో పోగొట్టుకున్న వాడిలా, ఆలోచిస్తూ కూర్చుంటున్నారు. నా మీద కోపం వస్తున్నా ఆ కోపాన్ని దిగమింగుకుంటున్నారు కదూ! మీ గురించి నా కంతా తెలుసు. మీ మాటల్లోని అర్థం నాకు తెలుసు. అయినా మీకు లెక్కగా డబ్బులిచ్చి మీ కాళ్ళకు సంకెళ్ళు వేసినట్లు ఇంట్లో కూర్చోబెడుతున్నాను."

"అదే మామయ్యగారూ! ఆయన బాధపడుతూ ఉంటారదే. మీ గురించి నా దగ్గర చాలా బాధపడుతున్నారు. ఆయన జీతంతో మీరే అంతా చూడండి. అంత వరకూ ఆయనకు తృప్తి ఉండదు. అయినా పెద్ద వాళ్ళ చాటున మే మందరం ఉండటం ఇంటికి అదో అందం. ఈ నెల నుండీ జీతం మీరే తీసుకొని అన్నీ మీరే చూడండి."

రాధ మాటలు విన్న నాకు ఆవేదనతో ఆయాసం వస్తోంది. నాన్నగార్ని తలెత్తి చూడలేక పోతున్నాను.

నాన్నగారు అదోలా చూస్తున్నారు నా వైపు. ఆ చూపులో అర్థం అర్థం కావడం లేదు.

నాన్నగారు లేచి ఆ కవర్ని టేబిల్‌మీద పెట్టి నా భుజాలు పట్టుకొని నన్ను లేపారు.

నేను బరువుగా లేచాను.

"బాబూ, ఆనంద్! కళ్ళు తుడుచుకొని నా వైపు చూడు" అని తన పై తువాలుతో నా కళ్ళు తుడిచారు.

నేను నాన్నగారి వైపు చూడలేక చూడలేక చూశాను. నాన్నగారు నవ్వుతున్నారు. ఆ నవ్వులో వింతతనం, క్రొత్తదనం, ఆనందం కన్పించాయి నాకు. నా గుండె తేలిక పడినట్లయింది.

"ఒరే, ఆనంద్. పెళ్ళి చేసుకొని, బిడ్డల్ని కంటున్న నువ్వు పెద్దవాడివి కాదురా! ఇంకా నా బుజ్జి వెన్న ముద్దవే! చదువుకున్నా, జీవితాన్ని అనుభవిస్తున్నా నీ మన సింకా పసి మనసేరా! స్వచ్ఛమైన వెన్న ముద్దరా! ఎంత చిన్న పిల్లాడిలా ఆలోచిస్తున్నావురా. నీకు ఈ తండ్రికి నీ మీదున్న ప్రేమ తెలీదా?

ఈ చేతులు నిన్ను మోసిన చేతులురా! నీ నోట్లో పెరుగన్నం ముద్దలు తినిపించిన చేతుల్రా! ఈ గొంతు నిన్ను 'వెన్న ముద్దా!' అని నోరారా ప్రేమగా పిలిచిన గొంతురా. ఈ మనసు నిన్ను చూసి మురిసిపోతూ పొంగిపోయిన మనసురా. వీటికి నీ మీద కోపం రాదు. మనది రక్తబంధం కాదు. ఆత్మీయతానురాగ బంధం. విడదీయలేని అనుబంధంరా. నీ మీద కోపం అంటే ఈ పెంచిన తండ్రికి తెలియదురా. అయినా నీ మీద కోపం ఎందుకు రావాలి? చెప్పు!" బుజ్జగింపుగా అన్నారు.

అలా అంటుంటే నా మనసు కరిగిపోయింది. కన్నీరు ఇంకా పెల్లుబికింది.

నేను తల త్రిప్పి టేబిల్ వైపు చూశాను, అక్కడున్న కవరు వైపు.

నాన్నగారు అర్థం చేసుకున్నారు కాబోలు. "జీవితం ఆఖరి దశలో ఉన్న మనిషికి బిడ్డల ఆనందం, అదృష్టాల్ని చూసి ఆనందించాలని ఉంటుంది గానీ. ఏదీ అనుభవించాలని ఉండదురా. నువ్వెందుకు బాధ పడుతున్నావో తెలిసిందిరా నాకు. డబ్బుని నీళ్ళలా ఖర్చుచేసిన నాకిప్పుడు డబ్బే కరువై పోయిందని, నువ్వు నాకు డబ్బు ఇవ్వడం లేదని కదూ? ఎంత వింతగా ఆలోచించి బాధ పడుతున్నావురా? అప్పు డలా ఖర్చు చేయడంవల్లే నీ కంటూ ఏదీ మిగల్చలేకపోయాను. నువ్వు కష్టపడి చదువుకున్న చదువే నీకు మిగిలింది. బాబూ! కని పెంచిన తల్లిదండ్రుల కందరికీ ఈ అదృష్టం ఉండదేమోరా? ఇప్పుడు నాకూ ఏడవా లనిపిస్తోంది బాధతోకాదు—ఆనందంతో, నా కొడుకు నాగురించి ఇంతలా, ఇంత ప్రేమగాఆలోచిస్తున్నాడనీనాకిదేచాలురా ఏ తండ్రికైనా ఇదే చాలు. డబ్బు కాదు! నువ్విచ్చే డబ్బు నాకు చాలడంలేదని, అందుకే నేను బాధ పడుతున్నానని కదూ నీ వనుకుంటున్నావు? నాకేం ఖర్చులుంటాయిరా? సమయం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. నువ్వు నెల నెలా ఇచ్చే డబ్బులో నీవు ఖర్చు మనిషివని సురేష్ పేరన బ్యాంకులో అరవై రూపాయలు వేస్తున్నాను. నాకు ఒక వదీ, ఇరవై ఖర్చయినా అప్పుడప్పుడూ ఇంట్లోకి ఆ మిగిలినవి ఖర్చు పెడుతున్నాను. డాక్టరు చెప్పిందగ్గర్నుండీ కాల్చే ఆ నాలుగు సిగరెట్లూ కూడా మానేశాను."

"నువ్వనుకున్నట్లుగా ఏ తల్లి దండ్రీ ఆలోచించరు. అలా ఆలోచించే వయసు, సమయం కాదురా ఇది. ఆగిపోయే జీవితం నాది. జీవించే తరుణం నీది. ఆలోచిస్తే తీరునుబట్టి అంకించే మాటల అర్థాలు ఉంటాయి. నీ పిల్లల గురించి, వాళ్ళ భవిష్యత్తు గురించి ఆలోచించు. అంతేగాని ఇలాంటివి ఆలోచించకు.

"చేయాల్సిన పని లేక, చేయడానికి, తిరగడానికి ఓపిక లేక, ఏమీ తోచక, అలా కుర్చీలో కూర్చుని ఉంటున్నాను గానీ, నా కొడుకు నా మీద డబ్బు వర్షం కురిపించడంలేదని బాధపడడం లేదురా."

"నాన్నగారూ అయితే మీ రప్పుడప్పుడు కన్నీళ్ళు పెట్టుకుంటుంటారు. ఎప్పుడూ కిటికీలోనే చూస్తుంటే నాకు కన్నీటి పొర కన్పిస్తూ ఉంటుంది మీ కళ్ళలో. అది మీరు బాధపడడం కాకపోతే మరేమిటి? ఏ బాధా లేకపోతే ఆ కన్నీరు ఎందుకు?" అని అడిగాను బొంగురు కంఠంతో నెమ్మదిగా.

నాన్నగారు నవ్వారు బాధగా.

"బాబూ! నువ్వు పెద్దవాడి వయ్యావు. నీకు చెప్పడం అవసరం. నీకు గుర్తుందా? ఎప్పుడూ భార్యను ప్రేమగా చూసుకోమని చెప్తుంటాను. ఎందుకో తెలుసా? హాయిగా సాగుతున్నా ఎందుకైనా ఇంట్లో గొడవలు రావడం సహజం. నువ్వు మంచి వాడిగా, తెలివైన వాడిగా, బుద్ధిమంతుడిగా తయారవడానికి కారణం ఎవరో తెలుసా? మీ అమ్మ! అలాంటి మీ అమ్మను నే నెప్పుడూ సుఖపెట్ట ఎరుగనురా. మీ సంసారంలో ఉన్న ఆనందం నా సంసారంలో నూరో వంతు కూడా లేదు. నా కొడుక్కున్న జ్ఞానం నాకు రవ్వంతైనా లేకపోయిందే అప్పుడు నాకు అన్న బాధ. ఆ కన్నీటికి సరైన కారణం అదేరా! కొట్టి, తిట్టి నీ తల్లిని సాగనంపానే గానీ, ఎప్పుడూ ఆమెను సంతోషపెట్ట ఎరుగను. నా వల్ల కష్టపడిన పై మనిషి ఎవ్వరూ లేరు. కానీ ఎందుకో ఏదో అంధకారంలో పడిపోయి మీ అమ్మను బాధ పెట్టేవాడ్ని. నా బాధలకు తట్టుకొని, తట్టుకొని ఆఖరుకు మీ అమ్మ వెళ్ళిపోయింది. వెళ్ళి పోయాకనేరా నాకు భార్య విలువ తెలిసింది. అందుకే అందుకే. ఆ సంఘటనలు, అందులోని నామూర్ఖత్వం కళ్ళకు కట్టినట్లు కన్పించి మీ అమ్మ జీవితానికి నేను చేసిన అన్యాయం గుర్తొచ్చి పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న నా కళ్ళలో కన్నీరు ఎప్పుడూ కదులుతూ ఉంటుంది. నా గుండె బరువెక్కిపోతూ ఉంటుంది. మగవారు సాధారణంగా చేసే తప్పు, చేయకూడని తప్పు, తెలుసుకోవల్సిన నిజం ఇదేరా! లేకపోతే పశ్చాత్తాపం పడ్డం తప్ప మరింకేమీ చేయలేడు. అంతే!"

"నువ్వేమీ పిచ్చి పిచ్చిగా ఆలోచించి నీ మనసును పాడుచేసుకోకు. అనుభవించాల్సిన జీవితం నీది.. మిమ్మల్ని చూసి ఆనందించాల్సిన అదృష్టం నాది, అమ్మా, రాధా అందరికీ భోజనాలు వడ్డించు. నడు బాబూ!" అని రాధతో అని నా భుజంమీద ఒక చేత్తో బుజ్జగిస్తున్నట్లుగా తట్టి రెండో చేతిలోకి నా చేతిని తీసుకున్నారు.

తేలిక పడిన గుండెతో, క్రొత్త ఆనందం నిండిన మనసుతో నాన్నగార్ని అనుసరించాను.

నడుస్తున్న మా కళ్ళకు గుమ్మానికి తగిలించి, అందంగా పూలమాల సమర్చిన "అమ్మ" ఫోటో కన్పించింది, నన్ను ఆశీర్వదిస్తున్నట్లుగా.

నాన్నగారిలో మామూలు నవ్వుదనం కన్పించింది నాకు.

అప్పుడే సురేష్ కూడా "అమ్మా! ఆకలేస్తుంది అన్నం పెట్టవూ!" అని బయటనుండి పరుగెత్తుకొని వచ్చాడు. ★

